క్లుప్తంగా

తైక్వాండోలో విద్యార్థి ప్రతిభ



మోహన్‌రాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాజోలు: తైక్వాండో పోటీల్లో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి.మోహన్ రాజ్ ప్రతిభ కనబరచి వెండి పతకాన్ని సాధించాడు. ఈ మేరకు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ పి.సాయిబాబు ఆధ్వర్యంలో విద్యార్థి మోహన్‌రాజ్‌ను అభినందించారు. ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ఆధ్వర్యంలో కాకినాడ ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాలలో పోటీలు జరిగాయి. వైఎస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, కో–ఆర్డినేటర్ డాక్టర్ బోస్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి నల్లి రాజు, పీడీ బొందు మధుకుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అంబాజీపేట: ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కొర్లపాటివారిపాలెంకు చెందిన పరసా చిన్న నాయుడుకు స్థానికులు ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. గణపతి వీరరాఘవులు, మైపాల తాతాజీ, మేడిది చిన్న, కొర్లపాటి కాశీ, సూదా బత్తుల రవిలు నాయుడుకు మనోధైర్యం కల్పించి ఆర్థిక సాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

భారీ అన్నసమారాధన

అంబాజీపేట: విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపాలెం హంస వాహన నిర్వాహకులు శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అంతకు ముందు శ్రీసీతారాములకు, సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు.

వాష్ బేషిన్ల నిర్మాణం



అప్పనపల్లిలో వాష్ బేషిన్లను ప్రారంభిస్తున్న హెచ్ఎం సూర్యప్రకాశరావు

మామిడికుదురు: అప్పనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.30 వేలతో విద్యార్థుల కోసం వాష్ బేషిన్లు నిర్మించారు. వీటిని స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బావరాజు సూర్యప్రకాశరావు శనివారం ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న స్కూల్ అభివృద్ధికి అందించిన సహకారం మరువరానిదని ఈ సందర్భంగా హెచ్ఎం పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు. వాష్ బేషిన్ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆ సమస్యకు పూర్వ విద్యార్థులు ముగింపు పలికారన్నారు. కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ చొల్లంగి దుర్గాభవాని, పూర్వ విద్యార్థులు మేడేపల్లి సత్యనారాయణ, పడవల మల్లేష్, చింతపల్లి సతీష్, పసుపులేటి నాగమణి, కనకదుర్గ, ప్రసూన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదిగ కులాల ఆత్మీయ సభకు తరలిరండి

మామిడికుదురు: రాజమహేంద్రవరంలో నవంబర్ 2న జరిగే మాదిగ అనుబంధ కులాల ఆత్మీయ కలయిక సభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవంలో శనివారం జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2న రాజమహేంద్రవరంలో జరిగే సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారన్నారు. ఈ సభకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

పెనికేరులో రెవెన్యూ గ్రామ సభ

ఆలమూరు: మండలంలోని పెనికేరులో శనివారం రెవెన్యూ గ్రామ సభలు జరిగాయి. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వనుం చిన్నావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతుల నుంచి స్వీకరించిన 37 దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మండల రెవెన్యూ అధికారి ఎం.రామాయమ్మ, మండల సర్వేయర్ ఎం.ప్రభావతి, గ్రామ కార్యదర్శి జె.అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం తులాభారంగా సమర్పించారు.

సొంత విత్తనం.. లాభదాయకం

- మొలకశాతం ఎక్కువ–తెగుళ్ల బెడద తక్కువ
- పొలంబడిలో విత్తన తయారీపై అవగాహన
- బల్లకట్టు పద్ధతిలోనే రబీ విత్తన తయారీ



విత్తన ధాన్యాన్ని బస్తాల్లో నింపుకుంటున్న రైతులు

ఆలమూరు: వరిసాగులో నాణ్యమైన పంటలను పండించేందుకు మేలైన విత్తనాల అవసరం ఉంది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం రకరకాల విత్తనాలు అందుబాటులో ఉన్నా నాణ్యత లేమి ఉండటంతో పాటు కేళీల ధాన్యం కలసిపోవడంతో రైతులు తరచూ గిట్టుబాటు ధర రాక తీవ్రంగా నష్టపోతున్నారు. అందులో భాగంగా సొంతంగా విత్తనాన్ని తయారు చేసుకునే విధానాన్ని వ్యవసాయశాఖ ప్రోత్సహిస్తుంది. వరిసాగు చేపట్టే రైతులు కూడా ఆయా గ్రామాల్లో సొంతంగా తయారు చేసుకునే విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేయడానికే ఇష్టపడుతున్నారు. గ్రామీణ స్థాయిలో ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తయారు చేస్తున్న విత్తనాలకే అధిక ప్రాధాన్యం లభిస్తుంది. ఇప్పటికే ఖరీఫ్‌లో సాగు చేసిన రబీ విత్తనాల వరిసాగు దశల వారీగా అందుబాటులోకి వస్తుంది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ తయారీ చేసుకున్న వరి విత్తనాలను నిల్వ చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

విత్తన సాగుకు అధిక ప్రాధాన్యం

వరిసాగులో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విత్తనాల కొరత దృష్ట్యా గత ఐదేళ్లుగా రైతులు సొంతంగానే విత్తనాలు తయారు చేసుకోవడం పరిపాటిగా మారింది. దీంతో ఏటా సొంత అవసరాలను తీర్చుకోవడంతో పాటు ఇతర రైతులకు అధిక లాభాలకు విక్రయించే విధంగా ఖరీఫ్, రబీ సీజన్లలో సుమారు ఐదు శాతం మేర వరి విత్తనాలను తయారు సాగు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో 28764 ఎకరాల్లో ఖరీఫ్ జరిగింది. అందులో సుమారు రెండు వేల ఎకరాల్లో విత్తన సాగు జరిగింది. సుమారు 80 శాతం మేర స్వర్ణ రకాన్ని సాగుచేయగా మిగిలిన 20 శాతంలో విత్తన అవసరాల కోసం ఎంటీయూ 3626 (బొండాలు), ఎంటీయూ 1318 తదితర రకాలను సాగు చేశారు. రబీలో సాగుకు సంబంధించిన వరి రకాలను ఖరీఫ్‌లోను, ఖరీఫ్‌కు సంబంధించిన వరి రకాలను రబీలోను సాగు చేసుకుని రైతులు తమ విత్తన అవసరాలను తీర్చుకుంటారు. క్లస్టర్ పరిధిలోని 11 మండలాల్లో రబీ సీజన్‌లో సాగు చేసే వరి పంటకు సుమారు ఐదు వేల టన్నుల విత్తనాలు అవసరమవుతాయి. ఇటీవల కాలంలో వెదజల్లు విధానాన్ని రైతులు ఎక్కువగా అవలంబించంతో విత్తనాల అవసరత తగ్గుతుంది.

బల్లకట్టు విధానంలోనే నాణ్యమైన విత్తనాలు

సాధారణంగా విత్తన అవసరాల కోసం సాగు చేసిన రైతులు బల్లకట్టు విధానానికే అధిక ప్రాధాన్యం ఇస్తారు. ట్రాక్టర్ లేదా యంత్రాల ద్వారా మాసూళ్లు చేస్తే విత్తనాల మొలక శాతం తగ్గిపోతుంది. దీంతో ఆకుమడుల దశలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అయితే వరి చేలల్లో కూలీలతో కోయించిన పనలను బల్లకు కొట్టి ధాన్యం సేకరించే (బల్లకట్టు) పద్ధతి ద్వారా మాసూళ్లు చేస్తే నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వస్తాయి. ఈ విత్తనాలను తేమ శాతం తగ్గే విధంగా ఎండలో ఆరబెడితే ఆకుమడుల్లో మొలక శాతం మెరుగ్గా ఉంటుంది. అలా తయారు చేసుకున్న విత్తనాలను రైతులు తమ సొంత అవసరాలకు పోను సరైన గిట్టుబాటు ధరకు ఇతర రైతులకు విక్రయిస్తుంటారు. మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న విత్తనాల్లో ఎక్కువగా కేళీలు వస్తున్నాయి. మొలక శాతం కూడా తక్కువగా ఉంటోంది. ఈ కారణాలతో సొంత తయారీ విత్తనాలకు వరిరైతుల నుంచి విపరీతమైన డిమాండ్ ఏర్పడుతుంది.

సొంత విత్తన తయారీకే మొగ్గు..

బహిరంగ మార్కెట్‌లో లభించే విత్తనాలు అంతగా నాణ్యతగా ఉండటం లేదని అభిప్రాయంగా ఉంది. రైతులు సొంత విత్తన తయారీ లేదా రైతుల తయారు చేసే విత్తనాన్ని కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగానే రైతులు తమ సొంత విత్తనాలు నాటుకునేందుకే రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంతో పోలిస్తే రైతుల సీజన్ సీజన్‌కు విత్తన వరిసాగును పెంచుతున్నారు. గతంలో రైతులు వరి పరిశోధన కేంద్రాల్లో తయారు చేసే సీడ్ విత్తనాల కొనుగోలుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. అయితే ఇటీవల కాలంలో నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమాల్లో వ్యవసాయశాఖ అధికారులు కూడా రైతులే స్వయంగా విత్తనాలు తయారు చేసుకోవాలని సూచనలు చేస్తున్నారు. దీంతో వరిసాగు చేపట్టే రైతులు ఇటీవల కాలంలో సొంత విత్తన తయారీకి అన్నదాతలు ఆకర్షితులవుతున్నారు.

నాణ్యమైన దిగుబడి

వ్యవసాయశాఖ సూచనలు, సలహాలకు అనుగుణంగా ప్రతి సీజన్‌లోనూ విత్తనాలను సొంతంగా తయారు చేసుకుంటున్నాం. అందువల్ల మొలకశాతం బాగుండటంతో పాటు నాణ్యమైన దిగుబడులు సొంతమవుతున్నాయి. విత్తనాలు తయారు చేసుకోవడం ద్వారా కేళీలను అరికట్టవచ్చు.

– ఇల్లూరి పనసరామన్న, రైతు, పెదపళ్ల

అన్నదాతకు మేలు



అన్నదాతలు సొంతంగా విత్తనాలు తయారు చేసుకుని సాగు చేపట్టడం ద్వారా మేలు జరుగుతుంది. నాణ్యమైన విత్తనం లభించడం ద్వారా అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. సొంత తయారీ విత్తనాలను వాడితే తెగుళ్ల బెడదను నివారించవచ్చు.

– ఎస్.లక్ష్మీ లావణ్య, ఏవో, ఆలమూరు

అడవిపాలెం బాధితులకు అండగా నిలుస్తాం



రాజోలు ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: భూఆక్రమణలను అడ్డుకుని ప్రశ్నించినందుకు దాడికి గురై రాజోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న అడవిపాలెం బాధితులను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు శనివారం పరామర్శించారు. అడవిపాలెం పంచాయతీ భవన నిర్మాణానికి స్థల సేకరణ కోసం ప్రభుత్వ భూమిని సర్వే చేస్తుంటే భూఆక్రమణదారులు దాడి చేయడం చాలా దారుణమన్నారు. దాడిలో గాయపడ్డ బాధితులకు అండగా నిలుస్తామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని పక్కా భవనం నిర్మాణం చేసుకున్న రావి మసేస్, అతని కుమారుడు రావి రూపాస్, కందికట్ల బాలకృష్ణ, కొప్పినీడి రామకృష్ణ, గెడ్డం నాగభూషణం తదితరులు దాడికి పాల్పడ్డారని బాధితులు గొల్లపల్లికి వివరించారు. ప్రభుత్వ భూమిని సర్వే చేయించి పంచాయతీ భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించే విధంగా సహకరించాలని బాధితులు యడ్ల రత్నకుమార్, కందికట్ల శివకుమార్, కొల్లు నరసింహస్వామి కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి వెంట ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



బిళ్లకుర్రులో జీవామృతం తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తపేట: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించాలని బిళ్లకుర్రు సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు రైతులకు సూచించారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయంపై సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం, కషాయాల గురించి వివరిస్తూ జీవామృతం తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ద్రవ జీవామృతం వలన భూమి సారవంతంగా మారి మొక్క ఆరోగ్యకరంగా పెరుగుతుందన్నారు. జీవామృతం ఉపయోగించడం వలన వానపాములు పుట్టుకొస్తాయని వివరించారు. సర్పంచ్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు క్రమేపీ రసాయన మందుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయ విధానంలో జీవామృతం ఉపయోగించాలని సూచించారు. తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడమే కాక ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పండించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎంవీవీఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు

మామిడికుదురు: ఆదుర్రులో ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డూ అదుపూ లేకుండా యథేచ్ఛగా సాగిపోతున్నాయి. చీకటి పడిన వెంటనే స్థానిక నేతలు రంగంలోకి దిగి ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. పడవల ద్వారా ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను తీసుకువచ్చి వాటిని ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఎవరైనా వారిని ప్రశ్నిస్తుంటే మా ఇష్టం ఏం చేసుకుంటారో చేసుకోండని సమాధానం చెబుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతోనే ఈ వ్యవహారం సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఉన్నత స్థాయి అధికారులు హెచ్చరిస్తున్నా ఏ మాత్రం భయం లేకుండా అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తవ్వేస్తున్నారు. దీనిపై ఎమ్మార్వో ఆచార్యులును శనివారం వివరణ కోరగా ఆ వ్యవహారం గ్రామ పంచాయతీ కార్యదర్శి చూసుకుంటారు. అతడ్ని అడగండని సమాధానం చెప్పారు. మండల స్థాయి అధికారి సమాధానం అలా ఉంటే ఇక ఎవరు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటారన్న ప్రశ్నలు వినిపిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని స్థానిక ఎంపీటీసీ గెడ్డం మహాలక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిరోధించే దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



రామరాజులంకలో డిజిటల్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న విజిలెన్స్ అధికారులు

మలికిపురం: నేటి సమాజంలో పెరిగిపోతున్న డిజిటల్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విజిలెన్స్ ఇన్‌చార్జ్ రాంబాబు, ఆఫీసర్ విజయకుమార్ సూచించారు. శనివారం మండలంలోని రామరాజులంకలోని లేస్ బిల్డింగ్‌లో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు రామరాజులంక శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రాంబాబు అవినీతి నిర్మూలన, డిజిటల్ లావాదేవీలపై జరిగే మోసాల గురించి సవివరంగా వివరించారు. అనంతరం గ్రామ ప్రజలతో ఇంటిగ్రిటీ ప్లెడ్జ్ చేయించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ డి.పాపయ్య, ఇన్స్‌పెక్షన్ డిపార్ట్‌మెంట్ చీఫ్ మేనేజర్ ఈ.శాంతారాం, శంకర్, బ్రాంచ్ మేనేజరు శివరామిరెడ్డి, బ్యాంకు సిబ్బంది గ్రామ ప్రజలు, డ్వాక్రా మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీలో 39 పనుల నిర్వహణ

మామిడికుదురు: గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో లూటుకుర్రులో 39 పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని సర్పంచ్ అడబాల తాతకాపు తెలిపారు. పంచాయతీ వద్ద శనివారం జరిగిన సభలో సుమారు రూ.45 లక్షలతో చేపట్టే పనులకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు. 2025 ఏప్రిల్ నుంచి ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులపై సమావేశంలో సమీక్షించారు. ఐదు ఎకరాల గ్రామ పంచాయతీ చెరువును అమృత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో బాడిలంకలో సీసీ రోడ్డు నిర్మాణానికి తీర్మానం చేశారు. సమావేశంలో ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఏపీఓ రమేష్ బాబు, స్థానికులు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక గ్రామ సభ నిర్వహించారు. ఎస్ఆర్‌పీ వి.కనకారావు ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరగింది. మండలంలోని 17 గ్రామాల్లో 716 పనులకు గాను రూ.9,17,85,000 సామాజిక తనిఖీ నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్, ఏపీడీ మల్లికార్జునరావు, ఎంపీడీఓ బీకేఎస్ వెంకట్ రామన్, హెచ్ఆర్ మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల సేవలను గుర్తుంచుకోవాలి



పి.గన్నవరంలో పోలీసు అమరవీరుల దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



అంబాజీపేటలో విద్యార్థులకు వైర్‌లెస్ సెట్ పనిచేసే విధానాన్ని వివరిస్తున్న హెచ్‌సీలు

అంబాజీపేట: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమర వీరుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని హెసీలు వీఎస్ నారాయణ, బీజీవీ ప్రసాద్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా అంబాజీపేట ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అనునిత్యం పోరాడుతున్నారని, విరామం లేకుండా విధి నిర్వహణ చేస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి పోలీస్ స్టేషన్ యొక్క విధి విధానాలు, పోలీస్ వ్యవస్థ, పనితీరు తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిత్యం ప్రజల రక్షణ కోసం పోలీసులు నిర్వర్తించే విధులు, స్టేషన్‌లోని పరికరాల పనితీరు, వైర్‌లెస్ సెట్, తుపాకీలు తదితర వాటిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, పీఈటీ అందె సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని స్థానిక గ్రేస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నల్లి శ్రీచరణ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎస్సై బి.శివకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక గ్రేస్ విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో శ్రీచరణ్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు రేయింబవళ్లు పోలీసులు శ్రమిస్తున్నారని అభినందించారు. మహిళలు, విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏఎస్సై పట్టాభిరామయ్య, కళాశాల డైరెక్టర్ మనీషా, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు, నాగశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు

కొత్తపేట: సన్నజీవాలకు నట్టల నివారణ మందు క్రమం తప్పకుండా వేయించాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వెంకటనారాయణ జీవాల యజమానులకు సూచించారు. మండలం వాడపాలెంలో శనివారం మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎన్.రేవంత్‌కుమార్ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన కొత్తపేట ఏరియా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ జీవాలు పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి గొర్రెలు, మేకల పెంపకం దారులకు తెలియజేశారు. కార్యక్రమంలో అయినవిల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ శుభశ్రీ, వాడపాలెం గ్రామ పశుసంవర్ధక శాఖ సహాయకుడు రమేష్ పాల్గొన్నారు.

పి.గన్నవరం–అంబాజీపేట రోడ్డు పనులు ప్రారంభం

పి.గన్నవరం: రూ.8 కోట్లతో అంబాజీపేట–గన్నవరం ఆర్అండ్‌బీ రోడ్డు (ఏజీ రోడ్డు) ఆధునీకరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు పూర్తిగా పాడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం విదితమే. గత కొంత కాలంగా ఈరోడ్డుపై వెళ్లే ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. గత ప్రభుత్వం రోడ్డు ఆధునీకరణకు నిధులు మంజూరు చేసింది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పనులను ప్రారంభించారు. పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్ నుంచి అంబాజీపేట వరకూ సుమారు 6.6 కిలోమీటర్ల మేర రోడ్డును ఆధునీకరిస్తున్నారు. పోతవరం మొగలికొండల సెంటర్ వద్ద రావిపాడు డ్రెయిన్‌లోకి రోడ్డు కుంగుతున్న నేపథ్యంలో అక్కడ సుమారు 350 మీటర్ల మేర కాంక్రీటు రక్షణ గోడ నిర్మిస్తామని ఆర్అండ్‌బీ ఏఈ రాజేంద్ర తెలిపారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకూ 10 మీటర్ల వెడల్పున సీసీ రోడ్డు అక్కడి నుంచి 7.5 మీటర్ల వెడల్పున తారు రోడ్డు నిర్మించనున్నారు.

సెక్రటరీ, వీఆర్వోలకు ఘనంగా సన్మానం

కొత్తపేట: మండలంలోని గంటి గ్రామ పంచాయతీ సెక్రటరీ డి.వరలక్ష్మి, వీఆర్‌ఓ పి.రాంబాబులకు శనివారం ఘనంగా వీడ్కోలు సన్మానం జరిగింది. ప్రస్తుతం ఉద్యోగుల బదిలీల్లో భాగంగా సెక్రటరీ వరలక్ష్మి అంబాజీపేట మండలం తొండవరం గ్రామానికి, వీఆర్‌ఓ రాంబాబు మండలంలోనే వానపల్లి గ్రామానికి బదిలీ అయ్యారు. సర్పంచ్ సాగి బంగార్రాజు ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ బంగార్రాజుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముళ్ల జనార్దనరావు, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ మట్టపర్తి వెంకట్రావు, భూపతిరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట ఆర్ఐగా రవిశంకర్

కొత్తపేట: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా పి.రవిశంకర్ బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకూ ఇక్కడ ఆర్ఐగా పనిచేసిన కొప్పిశెట్టి ఏడుకొండలు అంబాజీపేట మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో కలెక్టరేట్‌లో పనిచేసిన రవిశంకర్ బదిలీపై కొత్తపేట మండలానికి వచ్చారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,53,605, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.59,291తో మొత్తం రూ.2,12,896 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.

ప్రముఖుల పూజలు, అన్నప్రసాదానికి విరాళాలు

ఐఏఎస్ అధికారి, రాష్ట్ర యూత్ సర్వీసెస్ కమిషనర్ కె.శారదాదేవి కుటుంబ సభ్యులతో కలసి ఉమా శనైశ్చరస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం అధికారులు, సిబ్బంది, అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద పండితులతో వేదాశీర్వచనం అందజేసి స్వామివారి చిత్రపటాన్ని అందచేశారు. అనంతరం వారు అన్నప్రసాదం స్వీకరించి, సంతృప్తి వ్యక్తం చేశారు. శాశ్వత అన్నప్రసాదం విరాళం నిమిత్తం రూ.5,516 సమర్పించారు. అలాగే పాలకొండకు చెందిన కె.వెంకటరమణమూర్తి శాశ్వత అన్నప్రసాదం విరాళం నిమిత్తం రూ.25,100, హైదరాబాద్‌కు చెందిన ఆర్‌వీ కృష్ణమూర్తి రూ.5,516 సమర్పించారు.


జాతీయ శిల్పకళా మేళాలో వీరనాట్యం, గరగ నృత్యం



జైపూర్‌లో గరగ నృత్యం ప్రదర్శిస్తున్న ప్రసాద్ బృందం

కొత్తపేట: రాజస్తాన్ స్టేట్ జైపూర్ శిల్పకళా మేళా కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వీరనాట్యం, గరగ నృత్యం బృందాలు పాల్గొన్నాయి. రాజస్తాన్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జైపూర్ జవహర్ కళా కేంద్రంలో ఈనెల 18 నుంచి 28 వరకూ జరిగే శిల్పకళా మేళాకు దేశ వ్యాప్తంగా వివిధ కళారూపాల నృత్య ప్రదర్శనల బృందాలను ఎంపిక చేశారు. దానిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి కొత్తపేట మండం పలివెల గ్రామానికి చెందిన కళాస్రవంతి సంగీత, వాయిద్య, నృత్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొమారిపాటి ఏసువెంకటప్రసాద్ ఆధ్వర్యంలోని వీరనాట్యం, గరగనృత్యం ప్రదర్శనలు ఎంపిక చేశారు. ఆయా బృందాల నుంచి 15 మంది కళాకారులు పాల్గొని శుక్రవారం వీరనాట్యం, శనివారం గరగ నృత్యం ప్రదర్శించి, ప్రేక్షకులను మెప్పించారు. వారికి నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు.

ఆరోగ్యశాఖలో అన్నీ అవస్థలే..



ఆలమూరు మండల సర్వసభ్య సమావేశంలో ఆరోగ్యశాఖ పనితీరును ప్రశ్నిస్తున్న ప్రజా ప్రతినిధులు

ఆలమూరు: రూ.కోట్ల వ్యయంతో ఆస్పత్రులను నిర్మించి రూ.లక్షల్లో వేతనాలు ఇస్తున్నా ప్రభుత్వ ఆస్పత్రులు మాత్రం ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదని ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసే అవకాశం లేకపోవడంతో పాటు క్షేత్రస్థాయి ఆరోగ్య, ఆశ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్‌లు గుణ్ణం రాంబాబు, సంగిత సుభాష్ ఆరోపించారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజా ప్రతినిధులు వివరించారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులెవరికి మినీ గోకులాల మంజూరు విషయం తెలియజేయకపోవడంపై కోఆప్షన్ సభ్యులు షేక్ షరీఫ్, పెదపళ్ల ఎంపీటీసీ నెక్కంటి ప్రమీల ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని దారుణంగా రహదారులకు సత్వరమే మరమ్మతులు చేపట్టవలసిన అవసరం ఉందని పలువురు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ఆమోదించారు.

మిగులు బడ్జెట్ అంచనా రూ.19,700

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మిగులు బడ్జెట్ అంచనాలు రూ.19,700 ఉన్నట్లు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ వివరించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఆదాయం రూ.60,97,77,000 కోట్లు కాగా వ్యయం రూ.60,97,57,000గా నిర్ణయిస్తూ ఎంపీపీ లక్ష్మణరావు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సర్వసభ్య సమావేశంలో పరిశీలన అనంతరం ఎంపీటీసీ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, తహసీల్దార్ కేజే ప్రకాష్ బాబు, ఈఓపీఆర్‌డీ ఎ.రాజు, సీడీపీఓ పి.శారద తదితరులు పాల్గొన్నారు.